క్లుప్తంగా

విద్యతో పాటు అన్ని రంగాల్లో ఆసక్తి చూపాలి

కాకుమాను: విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా ఆసక్తి చూపాలని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జీవశాస్త్ర ఉపాధ్యాయిని జవహర్ రాణి ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థినులు తయారు చేసిన వివిధ రకాల పూల బోకేలు, వస్తువులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఎంపీడీఓ యుగకీర్తి, ఎంఈఓలు కెనడీ, విజయ్ భాస్కర్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నల గడ్డ గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు రోడ్డుకు ఇరువైపుల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి రోడ్లను శుభ్రపరిచారు. కార్యక్రమంలో వంగా నవీన్‌రెడ్డి, డాక్టర్ సువర్ణలత, డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



పొన్నూరు: మండలంలోని రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. స్థానిక కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 27 వేల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారని, ఇప్పటికే అన్ని గ్రామాల్లో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. దళారుల బారిన పడి రైతులు నష్టపోకూడదని అన్నారు. వెంటనే రైతులు కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి వారిని మద్దతు ధర లభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరిగేలా చూడాలని చెప్పారు. సమావేశంలో డీటీ రాజా రమేష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో శనివారం జరిగింది. నారాకోడూరు గ్రామానికి చెందిన వి.రవికుమార్ ద్విచక్ర వాహనంపై వస్తున్న సందర్భంగా వేజండ్ల అడ్డ రోడ్డు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో రవికుమార్ కాలి విరిగి ఫ్యాక్చర్ అయింది. గాయాలైన క్షతగాత్రుడిని 108లో వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు నమోదు

పట్నంబజారు: వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. సుద్దపల్లి డొంకలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే విశ్వనాథం రాజారావు, వెంకటేశ్వర్లు ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. లావాదేవీల నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం జరిగింది. శనివారం రాజారావుపై వెంకటేశ్వర్లు తన నివాసం వద్ద పెట్రోలు పోసి నిప్పంటించాడు. గాయాలపాలైన రాజారావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాలి

నెహ్రూనగర్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యా రంగంలో నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ కొండలరావు మున్సిపల్ హైస్కూల్, జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్స్- టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లకు చదివే పాఠశాల వాతావరణం, పిల్లల ప్రోగ్రెస్‌ని నేరుగా పరిశీలన చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాలని, వారి ప్రవర్తన, మిత్రులు, ఆలోచన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తమ లక్ష్యాన్ని తాము ఎక్కువ సమయం గడిపే ప్రదేశంలో స్టిక్ చేసుకొని నిత్యం లక్ష్య సాధనపై దృష్టి సారించాలని సూచించారు. తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధితో పాటు సమస్యలు కూడా అధికంగా ఉంటున్నాయని, పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్ వందనం

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య నందిస్తున్నట్లు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం హెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌రవూఫ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లి దండ్రులు కమిటీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. మీ పిల్లల బాధ్యత కన్నా మీకు పనులు ఎక్కువేం కాదన్న విషయాన్ని తల్లి దండ్రులు గమనించాలని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల కన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఐఏఎస్‌లు అవుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం, పది విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం, పాఠశాల మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బృహత్తర బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శివపార్వతి, ఎంఈఓలు రమాదేవి, లీలారాణి పాల్గొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి

పొన్నూరు: ఇంగ్లిష్ మీడియంపై ఆసక్తిని వీడి విద్యార్థులు మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లలు అన్ని విషయాలలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి ఉపాధ్యాయులు విద్యార్థినులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు నిర్భయంగా చెప్పాలని సూచించారు. పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని ఆ విషయంలో తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యతను పెంచటానికి ఇలాంటి వేదికలు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల పర్యవేక్షణ తగ్గిందని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యను అందించాలని వెల్లడించారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. పాఠశాలలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వీలైనంత త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, పట్టణ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

పేరెంట్, టీచర్స్ ఆత్మీయ సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్, టీచర్‌ల సమావేశం శనివారం నిర్వహించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ ఎం.వందనం, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణమ్మ, ఎంపీడీవో కె.లలిత, తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, విద్యాకమిటీ చైర్మన్ వి.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పూర్వ విద్యార్థులు 20వేల విలువైన క్రీడా సామగ్రిని వ్యాయమ ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వరావుకు అందజేశారు. శలపాడు, చేబ్రోలు, వడ్లమూడి, వేజండ్ల తదితర గ్రామాల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో అతిథులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంగా ముందుకు సాగాలి

కాకుమాను: విద్య అనేది ప్రతి ఒక్కరికి మూడో నేత్రమని అలాంటి విలువైన విద్యను ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్స్ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పాఠశాల హెచ్‌ఎం బి.సత్యం అధ్యక్షత వహించారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లిన తరువాత మననం చేసుకోవాలని ఆయన తెలిపారు. తల్లి దండ్రులు తమ చిన్నారులు ప్రతి రోజు పాఠశాలకు వస్తున్నారా, లేదా అనే విషయాలతో పాటు వారి ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు ఉండాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా పది పరీక్షల్లో ఐదు స్థానాలు సాధించిన ప్రతి ఒక్కరికి రూ.15 వేలు, ఇంటర్‌లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.25 వేలు అందజేయనున్నట్లు ప్రకటించారు. మరో పారిశ్రామికవేత్త నల్లమోతు(ఏరీస్)రత్తయ్య మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలల కంటే ధీటుగా ఉండడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఇస్రో రిటైర్డ్ అధికారి నూతి సత్యనారాయణ, పొన్నూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణయ్య, గ్రామ ఉప సర్పంచి బోడపాటి ప్రసాద్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గౌరు లక్ష్మి, తహసీల్దార్ బి.వెంకటస్వామి, ఎంపీడీఓ యుగకీర్తి, ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని విద్యార్థులు విద్యలో తీసుకోవాల్సిన పలు అంశాల గురించి వివరించారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి సిబ్బందికి, భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ ఏఎస్పీ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఏఎస్పీ రమణమూర్తి తదితరులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని 16వ డివిజన్ ఏటుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ ఏఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి సమయంలోనైనా ఫోన్‌లలో తెలియని యాప్‌లను, ఓటీపీలను ఇతరులతో పంచుకోరాదని తెలిపారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ శివాలశెట్టి రోజా, ప్రధానోపాధ్యాయులు వై.వాణి, ఉపాధ్యాయులు కె.బసవలింగారావు, పూర్ణచంద్రరావు, రత్తయ్య, చిరంజీవి, అమనాథ్, మార్కండేయులు, పోతుల రాము, అంకమ్మరావు పాల్గొన్నారు.

క్రిస్టియన్ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



గుంటూరు రూరల్: నగర శివారు 41వ డివిజన్‌లోని అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహాల సమీపంలో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. భవనం మొదటి ఫ్లోర్‌లో నిర్మాణం పూర్తయిన భోజనశాల, కాన్ఫరెన్స్ హాల్, ఆఫీసు రూమ్, కారిడార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు అధికారులు భవన నిర్మాణ పురోగతిపై వివరిస్తూ రెండు ఎకరాల స్థలం క్రిస్టియన్ భవన్‌కు కేటాయించడం జరిగిందని, దీనిలో 0.9 ఎకరాల్లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో మొదటి ఫేజ్ నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సెల్లార్, మొదటి అంతస్తులో భోజన ల పూర్తయ్యాయని వివరించారు. ప్రహరీ నిర్మాణం, ఆవరణలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, రెండవ అంతస్తులో ప్రధాన సమావేశ మందిరాన్ని నిర్మించాల్సి ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చేపట్టాల్సిన నిర్మాణ పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మాబూషరీఫ్, డీఈ భానుప్రకాష్, క్రిస్టియన్ మైనారిటీ సమన్వయకర్త పాస్టర్ ఎన్నయ్య, పాస్టర్లు ఏలీషా, ప్రకాష్ పాల్గొన్నారు.

అభినందన సభ

పట్నంబజారు: నగరంలోని గుంటూరు -2 డిపోలో పనిచేస్తున్న పలు విభాగాల్లో మైలేజీ సాధించిన డ్రైవర్లు, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించిన మరికొంత మందిని శనివారం డిపో -2 మేనేజర్ అబ్దుల్ సలాం సత్కరించి క్యాస్ రివార్డు అందజేశారు. అత్యధిక మైలేజీ సాధించిన డీఎస్‌కే రెడ్డి, పలు విభాగాల్లో ప్రతిభ చాటిన ఎ.బాజీ, షేక్ మస్తాన్‌వలి, బి.జక్రయ్య, మాణిక్యారావుకి అవార్డు అందజేశారు.

రామచంద్రన్ సేవలు అభినందనీయం



ఆచార్య డి.రామచంద్రన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏఎన్‌యూ: దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జి పరీక్షల కో ఆర్డినేటర్, కెమిస్ట్రీ అధ్యాపకులు ఆచార్య డి.రామచంద్రన్ సేవలు అభినందనీయం అని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న సందర్భంగా కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సంయుక్తంగా రామచంద్రన్‌కు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో రామచంద్రన్ ఈ స్థాయికి ఎదిగారన్నారు. సన్మాన గ్రహీత ఆచార్య రామచంద్రన్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి వచ్చేందుకు సహకరించిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హరిబాబు, దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎస్.వి. కృష్ణారావు, పీజీ పరీక్షల ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు ఆచార్య ఆర్.రమేష్ రాజు, అధ్యాపకులు రామచంద్రంతో వారికున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పరిశోధకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవరుచుకోవాలి

విప్రో సంస్థ హెచ్‌ఆర్ హెడ్ ప్రవీణ్‌కమత్‌కుంబ్లే



సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి దశనుంచి ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలని విప్రో సంస్థ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్ హెడ్ ప్రవీన్‌కమత్‌కూంబ్లే తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలో చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల వివిధ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రతిభను కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికెట్స్ పొందిన 110 మంది విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము చదివిని చదువులో ప్రస్తుత కాలానికి అవసరానికి అనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ మాట్లాడారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అందించే నాణ్యమైన, నైపుణ్యతలు కలిగిన విద్యా విధానాల ద్వారా అనేక జాతీయ అంతర్జాతీయ సర్టిఫికెట్‌లను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్నాతకోత్సవ సంబరం



మాట్లాడుతున్న విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్, లెర్నింగ్, ఒపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 2వ స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు. 860మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పట్టాభిపురంలో గుంటూరుజిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలాజీ మట్లాడుతూ హైస్కూళ్లలో ప్లస్‌టూ విధానాన్ని కొనసాగించి, రెగ్యులర్ పీజీటీలను ఉద్యోగోన్నతులపై నియమించాలని కోరారు. యాప్స్‌ను తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని చెప్పారు. జీఓ 223ను రద్దు చేసి జూనియర్ అధ్యాపక ఉద్యోగోన్నతుల్లో ఉపాధ్యాయులకు 40 శాతం కోటాను అమలు చేయాలని చెప్పారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బాలచంద్రా రెడ్డి, కె.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శలపాడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం



చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడులో శనివారం వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వరరావు హాజరైన కార్యక్రమానికి వ్యవసాయశాఖాధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు. శలపాడు గ్రామానికి చెందిన రైతు సతీష్, ఐదు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. అతడి వరి పొలంలో కోత ప్రయోగం నిర్వహించారు. దీని ప్రకారం 38 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు పీఎండీఎస్ వేయడం వలన ఎరువుల భారం తగ్గుతుందని రైతులకు అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. పంట కోత ప్రయోగంలో ఏఓ బి.శ్రీనివాస నాయక్, యూనిట్ ఇన్‌చార్జి అభిలాష్, మైలా వెంకట రామరాజు, వాసవి పాల్గొన్నారు.

నేడు నేషనల్ కరాటే పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): షిటో-ర్యు-కాయ్ ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు 9వ డాన్ బ్లాక్ బెల్ట్ హాన్షి కె.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 10-30 నిమిషాలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ హాజరవుతారని చెప్పారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధన దిశగా ఎదగాలి

- టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌బాబు
- ఎంబీటీఎస్‌లో ముగిసిన టెక్‌ఫెస్ట్



మాట్లాడుతున్న టుబాకోబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని టుబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబు తెలిపారు. రెండు రోజులుగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న టెక్‌ఫెస్ట్- 2024 శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు స్కిల్స్, నైపుణ్యాలకు మెరుగుదిద్దుకోవాలని కోరారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు సామినేని కోటేశ్వరరావు, సామినేని ఫణికుమార్ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన 113 వినూత్న ఆవిష్కరణల స్టాల్స్‌ను సందర్శించి వాటి గురించి తెలుసుకున్నారు. ప్రదర్శనలను వివిధ ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థినీ విద్యార్థులు 2350 మంది సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలిపారు. 113 ఆవిష్కరణలలో వివిధ విభాగాల నుంచి 20 ఆవిష్కరణలను జనవరి 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత సాధించాయని చెప్పారు. ప్రదర్శనలో ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కంప్యూటర్ విభాగం తయారు చేసిన కర్షక మిత్ర ప్రాజెక్ట్ స్టాల్‌కు మొదటి బహుమతి సాధించగా, హిందూ కాలేజి ఎలక్ట్రానిక్స్ విభాగం డిజైనర్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ ఐఓటీ బేస్ట్ స్మార్ట్ బ్యాక్ ఫర్ ఉమెన్ సేఫ్టీ ప్రదర్శనకు ద్వితీయ బహుమతి ఎంపికైనట్లు తెలిపారు.

పాఠశాలల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షణ అధికారి విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులకు పాఠశాలపై ఆసక్తి కలిగించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. నూటికి నూరు శాతం తల్లిదండ్రులు పాల్గొనటమే దీనికి నిదర్శనం అని అన్నారు. ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొనడం ఎంతో అభినందనీయమని అన్నారు. మున్సిపల్ కార్యాలయ పి.ఓ. రామారావు, పేరెంట్స్ కమిటీ తరపున సలీం, దుర్గాప్రసాద్ మాట్లాడారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ చిష్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. ఖాసీం, పాఠశాల ఆర్ధి దాత వై.కోటేశ్వరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దుర్గ, వైస్ చైర్మన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు జారీ చేయాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నివాసాల మధ్యలో ప్రజలకు దోమలు, డ్రెయినేజీ సమస్యలకు కారణమైన ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు ఇవ్వాలని, స్పందించకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కమిషనర్ విష్ణు నగర్, సీతయ్య డొంక, కాకాని రోడ్, పండరీపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను, ఆక్యుపెన్సీ దరఖాస్తులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహ్మన్, మల్లికార్జున, డీఈఈ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించకుంటే..

నగరపాలక సంస్థ పరిధిలో నీటి మీటర్ల బకాయిదార్లు రెండు రోజుల్లో చెల్లించకుంటే ట్యాప్ కనెక్షన్ తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూలు వేగవంతంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, రెహ్మాన్, సాధిక్ బాషా పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పట్నంబజారు: ఈనెల 15న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ గుంటూరు డిపో-2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలాం తెలిపారు. ఈనెల 13 రాత్రి గుంటూరు నుంచి బయల్దేరి 14న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల దర్శించుకుని 14వ తేదీ రాత్రికి అరుణాచలం చేరుకుంటారని తెలిపారు. 15వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ అనంతరం భక్తులందరూ దర్శనం చేసుకున్న తరువాత అదేరోజు సాయంత్రం అరుణాలచంలో బయల్దేరి 16వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటారని చెప్పారు. మరిన్ని వివరాలకు 7382897459 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.